సాక్షి మహబూబాబాద్

సోమవారం । 27 । జనవరి । 2025



పీహెచ్‌డీ ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ

కాకతీయ యూనివర్సిటీ సైన్స్ విభాగాల్లో పీహెచ్‌డీ ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేశారు.

- 8లో▸



బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి

బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలోనే అభివృద్ధి జరిగిందని, కాంగ్రెస్ ఏడాది పాలనలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని మాజీ ఎమ్మెల్యే రెడ్యా నాయక్ అన్నారు.

- 9లో▸

గరిష్టం/కనిష్టం

$35.7^0 / 14.2^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేశాం..



డోర్నకల్: ఐదేళ్లలో మున్సిపాలిటీ అభివృద్ధికి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నామని డోర్నకల్ మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న తెలిపారు. స్థానిక జైన్‌భవన్‌లో ఆదివారం మున్సిపల్ కమిషనర్ వెంకటస్వామి అధ్యక్షతన మున్సిపాలిటీ పాలకవర్గ వీడ్కోలు సమావేశం నిర్వహించి చైర్మన్, వైస్‌చైర్మన్‌తో పాటు 13 మంది కౌన్సిలర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ వీరన్న మాట్లాడుతూ.. ఐదేళ్ల పాలనలో కరోనా ప్రభావం, నిధుల కొరత, అభివృద్ధి పనులకు అడ్డంకులు, బిల్లుల మంజూరులో జాప్యంతో పాటు అనేక కారణాలతో ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలిపారు. వార్డు కౌన్సిలర్ సురేందర్‌జైన్‌తో పాటు పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ ప్రజలు తమపై నమ్మకంతో గెలిపిస్తే వారు ఆశించిన అభివృద్ధి చేయలేకపోయామని, దీనిపై బహిరంగం క్షమాపణలు కోరుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కేశబోయిన కోటిలింగం, కౌన్సిలర్లు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు




మహబూబాబాద్ రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని జెడ్పీ సీఈఓ పురుషోత్తం అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు సంక్షేమ పథకాల అర్హుల ఎంపిక పత్రాలను మహబూబాబాద్ మండలంలోని సంద్రాలగూడెం గ్రామంలో ఆదివారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు అర్హులకు కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను అమలు చేస్తారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఘుపతిరెడ్డి, తహసీల్దార్ భగవాన్ రెడ్డి, ఏఓ తిరుపతిరెడ్డి, ఎంపీఓ పార్థసారథి, ఏపీఎం తిలక్, ఏపీఓ రమేశ్‌రెడ్డి, ఏఈఓ రంజిత్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడాలి



నెహ్రూసెంటర్: ప్రతీ ఒక్కరు రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి అన్నారు. ఆదివారం గణతంత్ర వేడుకల్లో భాగంగా జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పార్టీ కార్యాలయంలో రాజ్యాంగ పరిరక్షణ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని రాజ్యాంగాన్ని కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా మారుస్తూ ప్రజలకు, కార్మికులకు ఫలాలు అందకుండా కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రతీ ఒక్కరు రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడాలని, కార్పొరేట్, ప్రైవేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్, సహాయ కార్యదర్శి రేషపల్లి నవీన్, జిల్లా కార్యవర్గ సభ్యులు చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, నాయకులు ఫాతిమా, వీరవెల్లి రవి, మహమూద్, తోట రాజకుమారి, మాలోత్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

అతిఉత్కృష్ట సేవా పతకం అందజేత



మహబూబాబాద్ రూరల్ : అర్మడ్ రిజర్వుడ్ కార్యాలయంలో రైటర్‌గా విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ పోతుల రాము అతిఉత్కృష్ట సేవా పతకానికి ఎంపికయ్యారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ చేతుల మీదుగా పోతుల రాము పతకం స్వీకరించారు.

ప్రమాద ఊహాచిత్రం

కొంతముందుకు రాగానే ఆటోను ఢీకొట్టి బ్రేక్ వేయడంతో కుడివైపునకు ట్రక్కు తిరిగి రహదారిని బ్లాక్ చేసింది. ఓవర్ స్పీడ్‌కు సడెన్ బ్రేక్ వేయడంతో ఆ ట్రక్కులోని ఇనుప స్తంభాలకు ఉన్న తాడు తెగి స్తంభాలు ఎగిరి ఎడమ, కుడివైపున ఉన్న ఆటోలపై ఒక్కసారిగా పడ్డాయి.

బెటాలియన్ పెట్రోల్ బంక్ సమీపంలో ట్రక్కు ఓ లారీని ఢీకొనబోయింది.

ట్రక్కు.. కక్కిరాలపల్లి నుంచి పంథినికి ఎరువు బస్తాలు తీసుకొస్తున్న ఆటోను ఢీకొట్టడంతో అది బోల్తా పడి డ్రైవింగ్ చేస్తున్న చిర్ర రాజేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అక్కడున్న వారు ట్రక్కును ఆపే ప్రయత్నం చేశారు.





బోల్తా పడిన భారీ ట్రైలర్ ట్రక్

నలిగిన వలస బతుకులు

పొట్టకూటి కోసం వస్తే నలుగురి ప్రాణం పోయింది



ఆటో కింద ఇరుక్కుపోయిన ఆటో డ్రైవర్ రాపర్తి సాగర్

- ఐదు రోజులక్రితమే మామునూరుకు వచ్చిన కుటుంబం
- వ్యవసాయ పనిముట్లు చేస్తూ జీవనోపాధి
- ట్రైలర్ ట్రక్ రూపంలో కబళించిన మృత్యువు
- లారీ డ్రైవర్ ఓవర్ స్పీడ్, ఇనుపరాడ్లు మీదపడడంతో మృతదేహాలు నుజ్జునుజ్జు
- మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారు..

పొట్టకూటి కోసం ఐదు రోజులక్రితమే రాష్ట్రం విడిచి వచ్చారు. డేరాలు వేసుకుని ఇనుప పనిముట్లు తయారు చేసి విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. మరో ఊరిలో వీటికి గిరాకీ బాగుందని తెలుసుకున్న ఆ కుటుంబం ఆటోలో వెళ్తుండగా బయల్దేరిన పది నిమిషాల్లో18 టైర్లతో కూడిన ట్రైలర్ ట్రక్ మృత్యు రూపంలో దూసుకొచ్చింది. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు విగతజీవులయ్యారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లోని గరీబ్‌నగర్‌కు చెందిన నువురు సంతోశ్‌చౌహాన్ (45), అతడి కుమార్తెలు పూజ చౌహాన్ (20), కిరణ్ చౌహాన్ (18), కుమారుడు ఖన్నా చౌహాన్ (7)గా గుర్తించారు. సంతోశ్ భార్య చామాబాయి, కుమారుడు ముఖేశ్ చౌహాన్‌తో పాటు ఆటోడ్రైవర్లు ఎండీ షకీర్, రాపర్తి సాగర్, చిర్రరాజుకు గాయాలయ్యాయి.

- సాక్షి, వరంగల్

- పూర్తి వివరాలు 8లో▸



రోడ్డు పక్కన పడిపోయిన ఆటో, ఐరన్ రాడ్లు



మృతదేహాన్ని తరలిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

ప్రజలకు భరోసా..



స్వాతంత్య్ర సమరయోధులకు సన్మానం



జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ (ఇన్‌సెట్‌లో), మాట్లాడుతున్న కలెక్టర్

జవాబుదారీతనం, పారదర్శక పాలన

- పేదల ముంగిటకు సంక్షేమ పథకాలు
- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్
- జిల్లా కేంద్రంలోని ఎన్‌టీఆర్ స్టేడియంలో గణతంత్ర వేడుకలు

సాక్షి, మహబూబాబాద్: త్యాగాల ఫలితం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనకు అనుగుణంగా జిల్లాలోని అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ప్రజలకు భరోసా కల్పిస్తూ.. ముందుకు వెళ్తున్నామని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. ఆదివారం మహబూబాబాద్ పట్టణంలోని ఎన్‌టీఆర్ స్టేడియంలో నిర్వహించిన గణతంత్ర వేడుకలకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం మాట్లాడారు.

విద్య, వైద్యం, వ్యవసాయం..

జిల్లా అభివృద్ధిలో కీలకమైన విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. జిల్లాలోని 21ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, 173సబ్‌సెంటర్లు, ఒక పట్టణ దవాఖాన, రెండు సీహెచ్‌సీలు, ఒక బస్తీ దవాఖానతో వైద్య సేవలు అందిస్తున్నామని అన్నారు. అదేవిధంగా మెడికల్, నర్సింగ్ కళాశాలల విద్యార్థుల సేవలు పేదలకు అందుతున్నాయని చెప్పారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ.10లక్షల వరకు ఉచిత వైద్యం, డయాగ్నోస్టిక్ సెంటర్ ద్వారా 134రకాల ఉచిత వైద్య పరీక్షలు అందిస్తున్నామని వివరించారు. అదేవిధంగా 1,216 పాఠశాలల్లో 1,00,180 మంది విద్యార్థులు చదువుతున్నారని, వారికి ఉచిత పాఠ్య పుస్తకాలు, రెండు జతల ఏకరూప దుస్తులు ప్రభుత్వం సరఫరా చేస్తోందన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పిస్తున్నామని, ఇందుకోసం రూ. 12.42కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. డీఎస్సీ ద్వారా 364 మంది నూతన ఉపాధ్యాయులను నియమించి మెరుగైన బోధన అందిస్తున్నామని వివరించారు. ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో మెరుగైన వసతితోపాటు, పౌష్టికాహారం అందించేందుకు 40శాతం డైట్ చార్జీలు పెంచామని అన్నారు. జిల్లాలోని 63,737 మంది రైతులకు రూ. 564.34కోట్లతో రుణమాఫీ చేశామని, మరణించిన 445 మంది రైతుల కుటుంబాలకు రూ. 22.25కోట్లు రైతు బీమాను అందించామని వెల్లడించారు. పండ్ల తోటలు, కూరగాయల సాగును ప్రోత్సహిస్తున్నామని కలెక్టర్ వివరించారు. ఆహార భద్రత పథకం ద్వారా ఉచిత బియ్యం సరఫరా చేస్తున్నామని అన్నారు. రైతులు పండించిన పంటలను గిట్టుబాటు ధరకు కొనేందుకు 238 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రూ. 1,55,000 టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని అన్నారు. మూడు మొబైల్ వెటర్నరీ క్లీనిక్‌లతో పశువుల వద్దకే వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నామని అన్నారు. చెరువులు, ఎస్సారెస్పీ జలాలను తరలిస్తూ వ్యవసాయానికి బాసటగా నిలిచామని చెప్పారు.

పేదల ముంగిట..

నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపాలనే ఆలోచనతో పేదల ముంగిటకు సంక్షేమ పథకాలు తీసుకెళ్తున్నామని చెప్పారు. గిరిజన సంక్షేమం ద్వారా 19 ఆశ్రమ పాఠశాలలు, 15 వసతి గృహాలు, 104 ప్రాథమిక పాఠశాలల్లో చదివే 8,266 మందికి విద్య, వసతి కల్పించి పౌష్టికాహారం అందిస్తున్నామని చెప్పారు. అంబేడ్కర్ ఓవర్సీస్ నిధి ద్వారా రూ. 12 మందికి రూ. 10లక్షల చొప్పున మంజూరు చేశామని అన్నారు. వెనకబడిన తరగతుల సంక్షేమంలో భాగంగా ప్రీమెట్రిక్ వసతి గృహాల నిర్వహణ, బీసీ, ఈబీసీ స్కాలర్‌షిప్స్ అందిస్తున్నామని చెప్పారు. కల్లు గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్లు, మైనార్టీ సంక్షేమశాఖ ద్వారా కుట్టు మిషన్లు, ఎస్సీ కార్పొరేషన్ రుణాలు, మహిళా, శిశు, వికలాంగులు, వయో వృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా భోజనం, పాలు, గుడ్లు అందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. మత్స్యశాఖ ద్వారా ఉచిత చేపపిల్లల పంపిణీ, నూతన చేపల చెరువుల నిర్మాణం కోసం సహకారం అందిస్తున్నామని తెలిపారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం ద్వారా జిల్లాలో 2,440 మందికి రూ. 25.కోట్ల అందజేశామన్నారు. వీటితోపాటు ఆరు గ్యారంటీల్లో మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాలు అమలు చేశామని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాల అమలుకు శ్రీకారం చుట్టామని తెలిపారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారుల సహకారంతో జిల్లాను ప్రగతి పథంలో నడిపిస్తున్నామని, ఇదే సహకారంతో మరింత అభివృద్ధి దిశగా ముందుకు వెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, వీరబ్రహ్మచారి, అధికారులు, స్వాతంత్య్ర సమరయోధులు, జిల్లా ప్రముఖులు పాల్గొన్నారు.



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు





విద్యార్థినుల సాంస్కృతిక నృత్య ప్రదర్శన





ఏకే-47 గన్‌తో ఎమ్మెల్యే మురళీనాయక్, విద్యార్థుల విన్యాసం

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో గణతంత్ర వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కాగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మానుకోటలోని మహాత్మాజ్యోతిరావుపూలే బీసీ గురుకుల పాఠశాల, మైనార్టీ గురుకుల పాఠశాల, బయ్యారం కస్తూర్బాగాంధీ విద్యాలయం, మన్నెగూడెం ప్రభుత్వ పాఠశాల, కురవి గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులు పలు జాతీయ గీతాలకు నృత్యాలు చేశారు. అదేవిధంగా తైక్వాండో ప్రదర్శనలు, బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలు, ఆత్మరక్షణ కోసం చేయాల్సిన పోరాటాన్ని మానుకోట కేజీబీవీ విద్యార్థినులు ప్రదర్శించారు. డీఈఓ ఏ.రవీందర్ రెడ్డి, జీసీడీఓ విజయ కుమారి, ఏఎంఓ ఆజాద్‌చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశారు.

స్టాళ్ల సందర్శన..

జిల్లాలోని పలు శాఖలో స్టాళ్లను ఆయా శాఖల అధికారులు ఏర్పాటు చేశారు. వాటిని కలెక్టర్, ఎస్పీ, అడిషనల్ కలెక్టర్ సందర్శించారు. సఖి- వన్ స్టాప్ సెంటర్ 181 కరపత్రాన్ని కలెక్టర్, ఎస్పీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.





గిరిజన విద్యార్థినుల తీజ్ నృత్యం

అర్హులకు న్యాయం చేస్తాం..

- ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి
- గాంధీనగర్‌లో నాలుగు పథకాలు ప్రారంభం
- హాజరైన ఎమ్మెల్యే మురళీనాయక్, ఎంపీ బలరాంనాయక్, కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్



గాంధీనగర్‌లో హాజరైన ప్రజలు



మంజూరు పత్రాలు అందజేస్తున్న ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మురళీనాయక్, పక్కన కలెక్టర్, ఎస్పీ

కేసముద్రం: అర్హులకు సంక్షేమ పథకాలు అందజేసి, న్యాయం చేస్తామని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి అన్నారు. 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మండలంలోని గాంధీనగర్‌జీపీలో నిర్వహించిన నాలుగు ప్రభుత్వ పథకాల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో ఏ ఒక్కరికి రేషన్‌కార్డులు, ఇళ్లు ఇచ్చిందిలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం గ్రామసభలను పెట్టి, ప్రజల సమక్షంలో అర్హులకు సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. ఒకటి రెండు చోట్ల చిన్నచిన్న సమస్యలు వస్తే ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని విమర్శించారు. జాబితాల్లో పేర్లు రానివారు తిరిగి దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్ మాట్లాడుతూ.. పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పాటుపడుతుందన్నారు.మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాలుగు పథకాలను అందించడానికి గ్రామసభలను నిర్వహిస్తే, కొందరు కిరాయి గుండాలను పెట్టి లొల్లి పెట్టిస్తున్నారన్నారు. పారదర్శకంగా పార్టీలకతీతంగా నిజమైన పేదవాళ్లు లబ్ధిపొందేలా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం గ్రామంలో రైతుభరోసా పథకం మంజూరు పత్రాలు 282 మందికి, ఇందిరమ్మ ఆత్మీయభరోసా 14 మంది, ఇందిరమ్మ ఇళ్లు 70 మంది, రేషన్‌కార్డుల మంజూరు పత్రాలను 23 మందికి అందజేశారు. అనంతరం వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మురళీనాయక్‌లను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, డీఆర్‌డీఓ మధుసూదన్ రావు, ఆర్డీఓ కృష్ణవేణి, కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, తహసీల్దార్ దామోదర్, ఎంపీడీఓ క్రాంతి, ఏఓ వెంకన్న, సొసైటీ వైస్ చైర్మన్లు అంబటి మహేందర్‌రెడ్డి, అల్లం నాగేశ్వర్‌రావు, భూక్య రామచంద్రు, మల్సూర్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఇనుగుర్తి మండలం పాతతండాజీపీలో పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ హాజరై మాట్లాడారు. జాబితాల్లో పేర్లు రానివారు ఆందోళన చెందవద్దన్నారు. పలువురికి పథకాల మంజూరు పత్రాలు అందజేశారు.

స్పెషల్ పాలన

- ముగిసిన మున్సిపాలిటీల పాలకమండలి గడువు
- స్పెషల్ ఆఫీసర్ల నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ
- జిల్లాలో ఐదు పురపాలికలు
- నాలుగు మున్సిపాలిటీల స్పెషల్ ఆఫీసర్‌గా అదనపు కలెక్టర్



మానుకోట మున్సిపాలిటీ కార్యాలయం

మహబూబాబాద్: మున్సిపాలిటీలకు స్పెషల్ ఆఫీసర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆదివారం మున్సిపాలిటీల పాలకమండలి పదవీకాలం ముగియడంతో ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రత్యేకాధికారులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు జిల్లాలోని మానుకోట, తొర్రూరు, డోర్నకల్, మరిపెడ మున్సిపాలిటీల స్పెషలాఫీసర్‌గా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పోను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. మున్సిపల్ ఎన్నికలు జరిగి, నూతన పాలకవర్గం కొలువుదీరే వరకు ప్రత్యేకాధికారుల పాలన కొనసాగనుంది.

ఐదు మున్సిపాలిటీలు..

జిల్లాలో మానుకోట, తొర్రూరు, మరిపెడ, డోర్నకల్ మున్సిపాలిటీలు ఉన్నాయి. కాగా కేసముద్రం మేజర్ గ్రామ పంచాయతీని ఇటీవల మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేయగా వాటి సంఖ్య ఐదుకు చేరింది. నాలుగు మున్సిపాలిటీల పాలకమండలి పదవీకాలం ఈనెల 26తో ముగిసింది. వెంటనే స్పెషల్ ఆఫీసర్ల నియామకం చేస్తూ ఆశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. పాలనపరమైన ఇబ్బందులు తలెత్తకుండా వెంటనే ప్రభుత్వం స్పందించి తగు చర్యలు తీసుకుంది.

అంచనాలు తారుమారు..

జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలకు స్పెషల్ ఆఫీసర్‌గా అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పోను నియమించారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో అందరి అంచనాలు తీరుమారు అయ్యాయి. గతంలో ఆర్డీఓలను స్పెషల్ ఆఫీసర్‌లుగా నియమించారు. అధికారుల అంచనాలను తారుమారు చేస్తూ అదనపు కలెక్టర్‌కు అవకాశం ఇచ్చారు. కాగా కేసముద్రం మున్సిపాలిటీకి స్పెషల్ ఆఫీసర్‌ను నియమించాల్సి ఉంది. ఆ మున్సిపాలిటీకి కూడా త్వరలోనే నియమిస్తారని అధికారులు తెలిపారు.

జీపీల్లో కొనసాగుతున్న స్పెషల్ ఆఫీసర్ల పాలన..

గ్రామాల్లో ఏడాదిక్రితం సర్పంచ్‌ల పదవీకాలం ముగియగా.. జీపీల్లో స్పెషల్ ఆఫీసర్ల పాలన కొనసాగుతోంది. గెజిట్ ఆఫీసర్ల(పాఠశాలల హెచ్‌ఎంలు, జేఎల్‌లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు)కు ఆ బాధ్యతలు అప్పగించారు. సర్పంచ్‌లకు ఉన్న అధికారాలన్నీ వారికి ఇవ్వడంతో పాలన సాగుతోంది. మున్సిపాలిటీల్లో కూడా ఎన్నికలు జరిగి పాలకమండలి ఏర్పాటయ్యే వరకు స్పెషల్ ఆఫీసర్ల పాలన కొనసాగనుంది.

క్లుప్తంగా

రాష్ట్ర ఉత్తమ పాస్‌పోర్టు ఉద్యోగిగా అవార్డు



గార్ల: రాష్ట్ర ఉత్తమ పాస్‌పోర్టు ఉద్యోగిగా గార్లకు చెందిన గోల్కొండ రవి ఆదివారం హైదరాబాద్‌లో రీజినల్ పాస్‌పోర్ట్ అధికారి స్నేహజ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. రవి మానుకోట హెడ్ పోస్టాఫీస్‌లో పాస్‌పోర్ట్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నారు. విధుల్లో అత్యంత ప్రతిభ కనబర్చినందుకు గాను అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా రవిని జిల్లా హెడ్ పోస్టాఫీస్ సూపరింటెండెంట్ రవికుమార్, నయీముద్దీన్, అనిల్ కుమార్ అభినందించారు.

ఎక్సైజ్ ఉద్యోగులకు అవార్డులు



గూడూరు: ఉత్తమ సేవలు అందించిన గూడూరు ఎక్సైజ్‌శాఖలోని ముగ్గురు ఉద్యోగులకు గణతంత్ర వేడుకల్లో భాగంగా ఆదివారం వరంగల్ డిప్యూటీ కమిషనర్ జి.అంజన్‌రావు అవార్డులు అందజేశారు. ఎక్సైజ్ సీఐ ఎన్.భిక్షపతి, హెడ్‌కానిస్టేబుల్ పి.బుచ్చయ్య, కానిస్టేబల్ కె. సుధాకర్ అవార్డులు అందుకున్నారు.

పీహెచ్‌డీ ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ సైన్స్ విభాగాల్లో పీహెచ్‌డీ ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఫెల్లోషిప్స్ కలిన విద్యార్థులు యూజీసీనెట్, సీఎస్ఐఆర్ నెట్, సీడ్, డీఎస్‌టీ, ఎన్ఈఎఫ్‌డబ్ల్యూడీ, డీఎస్‌టీ–ఇన్‌స్పైర్ లేదా ఎఫ్ఐపీ, క్యూఐపీ టీచర్ ఫెల్లోషిప్స్ తదితర నెట్, గేట్, జీప్యాట్ నేషనల్ లెవల్ టెస్ట్ స్కోర్స్ నెట్ కలిగిన వారు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కాకతీయ.ఏసీ.ఇన్‌లో దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకోవాలని సైన్స్ విభాగాల డీన్ ఆచార్య జి.హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. పూరించిన అప్లికేషన్లను సంబంధిత కార్యాలయంలో ఫిబ్రవరి 12 లోపు అందజేయాలని సూచించారు.

ఉత్తములకు ప్రశంస..



ప్రశంస పత్రం అందుకుంటున్న అదనపు కలెక్టర్ వీర బ్రహ్మచారి

జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన ప్రభుత్వ ఉద్యోగులకు ప్రశంసపత్రాలు అందజేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎన్‌టీఆర్ స్టేడియంలో నిర్వహించిన 76వ గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందజేశారు.

– సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్



ప్రశంస పత్రం అందుకుంటున్న మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు



పురుషోత్తం, జెడ్పీ సీఈఓ | మధుసూదన్ రాజు, డీఆర్‌డీఓ | విజయనిర్మల, డీపీఓ | రవీందర్ రెడ్డి, డీఈఓ | సురేష్, డీడీ గ్రౌండ్ వాటర్ | మదన్‌గోపాల్, సూపరింటెండెంట్ | భద్రకాళి, సూపరింటెండెంట్ కలెక్టరేట్ | నారాయణమూర్తి, సూపరింటెండెంట్ | రవీంద్రనాథ్, సీనియర్ అసిస్టెంట్ | అశోక్ రామకృష్ణ, టెక్నికల్ మేనేజర్ | నారాయణ, కలెక్టర్ పీఎస్ఓ | ప్రభాకర్, కలెక్టర్ డ్రైవర్



రాకేష్, ఓఎస్ | నవీన్ కుమార్, ఓఎస్ | దేవేందర్, సీఐ, మానుకోట టౌన్ | సర్వయ్య, సీఐ, మానుకోట రూరల్ | భాస్కర్, ఆర్ఐ | మురళీధర్ రాజు, ఎస్సై, కేసముద్రం | రవికుమార్, ఎస్సై, గంగారం | రమేశ్‌బాబు, ఎస్సై, నెల్లికుదురు | నగేష్, ఎస్సై, సీరోలు | సతీష్, ఎస్సై, మరిపెడ | పుల్లారావు, ఆర్ఎస్సై | సంజీవరెడ్డి, ఏఎస్సై, డీఎస్‌బీ



శ్రీనివాస్, కానిస్టేబుల్ డీసీఆర్‌బీ | నరేష్, కానిస్టేబుల్, సీసీఎస్ | కోటేశ్వరరావు, పీసీ బయ్యారం | రమేశ్‌చంద్ర, పీసీ, మానుకోట | ఖలీల్ పాషా, ఏఆర్ హెచ్‌సీ | మురళీకృష్ణ, ఏఆర్ పీసీ | రాంబాబు, ఏఆర్ పీసీ | హైమావతి, డబ్ల్యూపీసీ | జంపయ్య, హెచ్‌జీ | భిక్షపతి, టీఏ, డీఆర్‌డీఏ | శ్రీనివాస్, డీపీఎం | రవళి, ఏఈఈ, మిషన్ భగీరథ



రంజిత్‌కుమార్, ఫొటోగ్రాఫర్, డీపీఆర్‌ఓ | శ్రవణ్ కుమార్, మెడికల్ ఆఫీసర్, కేసముద్రం | నందనాదేవి, మెడికల్ ఆఫీసర్, తొర్రూరు | జ్యోతి, ఆశాకార్యకర్త, మానుకోట | రాజేశ్వరి, ఎంఎల్ హెచ్‌పీ, బయ్యారం | ఉమారాణి, నర్సింగ్ ఆఫీసర్, జీజీహెచ్ | ఉదయ్, ఈఎంటీ, మహబూబాబాద్ | శ్రీదివ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్, జీజీహెచ్ | శ్వేత, ఏఈఓ | శాంతి ప్రియదర్శిని, హెచ్‌ఓ, మానుకోట | సుమలత, అసిస్టెంట్ రిజిస్ట్రార్ | చంద్రమౌళి, డెయిరీ డెవలప్‌మెంట్



సుధాకర్, బిల్ కలెక్టర్ | సుజాత, ప్రిన్సిపాల్, కేసముద్రం | ఉమారాణి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ | సాయి చరణ్, ఏఎంవీఐ | అశోక్, పీసీ, ఇంటెలిజెన్స్ | కృష్ణ, ఫైర్‌మెన్ | వెంకన్న, వార్డర్, సబ్ జైల్ | మధు, హెడ్ కానిస్టేబుల్, ఎక్సైజ్‌శాఖ | కిశోర్‌కుమార్, ఎస్ఎంఎస్, మల్యాల కేవీకే | ప్రశాంత్ కుమార్, సైంటిస్ట్, హెచ్ఆర్ఎస్ మల్యాల



కలెక్టరేట్‌లో నృత్యం చేస్తున్న బాలికలు

కోర్టు, ఎస్పీ కార్యాలయాల్లో వేడుకలు



జిల్లా కోర్టులో జాతీయ జెండాకు వందనం చేస్తున్న జడ్జిలు సురేష్, తిరుపతి



జాతీయ జెండా ఎగురవేస్తున్న ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్: గణతంత్ర వేడుకల్లో భాగంగా ఆదివారం మహబూబాబాద్ జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సి.సురేష్, జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి జాతీయ జెండాలను ఎగురవేశారు. డీసీసీ కార్యాలయంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళీనాయక్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో

మహబూబాబాద్: కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈమేరకు కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ జాతీయ జెండా ఆవిష్కరించారు. కాగా కలెక్టరేట్ ఆవరణలో సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, వీర బ్రహ్మచారి పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ ఆత్మహత్యాయత్నం

- హైటెన్షన్ విద్యుత్ స్తంభంపై ఉరి
- ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాందాస్



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాందాస్

గార్ల: ఇంటికి వచ్చి ఘర్షణ పడటమే కాకుండా తనపై చెల్లెలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మనస్థాపానికి గురైన మాజీ సర్పంచ్ రాందాస్ హైటెన్షన్ విద్యుత్స్తంభం ఎక్కి ఉరివేసుకొని ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన మండలంలోని ఇందిరానగర్ తండా సమీపంలో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని సత్యనారాయణపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ రాందాస్ అతడి చెల్లెలు కల్యాణి మధ్య కొన్నిరోజుల నుంచి ఆర్థికపరమైన గొడవలు జరుగుతున్నాయి. అన్న రాందాస్‌కు రూ.2,20,000 నగదు, 21 తులాల బంగారం ఇచ్చానని, తిరిగి చెల్లించాలని చెల్లెలు అడుగుతోంది. ఈక్రమంలో శనివారం ఉదయం రాందాస్ ఇంటికి వెళ్లి అడుగగా ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన రాందాస్ సాయంత్రం చెల్లెలు కల్యాణి ఇంటికి వెళ్లి గొడవ పడ్డాడు. ఇరువురు అదేరోజు వేర్వేరుగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చెల్లెలు తనపై కేసు పెట్టిందని మనస్థాపానికి గురైన రాందాస్ ఆదివారం తండా సమీపంలోని హైటెన్షన్ విద్యుత్స్తంభం ఎక్కి ఉరి వేసుకున్నాడు. గమనించిన స్థానికులు విద్యుత్స్తంభం ఎక్కి అతడిని కిందకు దించి మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్య పరిస్థితి విషమంచడంతో ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై ఎస్సై రియాజ్‌పాషాను వివరణ కోరగా 'శనివారం ఇరువురు ఫిర్యాదు చేసుకున్నారు. పెద్దమనుషులు వచ్చి ఆదివారం పంచాయితీ చేసుకుంటామని చెప్పి జమానత్ పత్రం ఇచ్చి వారిని తీసుకొని వెళ్లారు' అని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ఎల్కతుర్తి: గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఓ మహిళ మండల కేంద్రంలోని జాతీయరహదారిపై మృతి చెందింది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన జగం స్వరూప(54) బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యం నిమిత్తం ఆదివారం ఉదయం నడుచుకుంటూ వెళ్తోంది. ఈ క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లింది. దీంతో తీవ్ర గాయాలపాలైన స్వరూప అక్కడికక్కడే మృతి చెందింది.

నలిగిన వలస బతుకులు

ట్రేలర్ ట్రక్ రూపంలో నలుగురిని కబళించిన మృత్యువు

- లారీ డ్రైవర్ ఓవర్ స్పీడ్, ఇనుపరాడ్లు మీదపడడంతో మృతదేహాలు నుజ్జునుజ్జు
- మృతులు ఒకే కుటుంబానికి చెందిన వారు..



ప్రమాద స్థలంలో గుమిగూడిన ప్రజలు

సాక్షి, వరంగల్ : మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లోని గరీబ్‌నగర్‌కు చెందిన నువురు సంతోశ్ చౌహాన్ కుటుంబానిది రెక్కాడితే గాని డొక్కాడనీ కుటుంబం. కత్తులు, కొడవళ్లు, గొడ్డలి, పారలతోపాటు ఇతర వ్యవసాయ పనిముట్లు తయారు చేస్తూ జీవనాన్ని వెళ్లదీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఐదు రోజుల క్రితం మామునూరుకు చేరుకున్నారు. అప్పటికే అక్కడికి వచ్చిన అతడి అన్న కొడుకు సుమీర్ కుటుంబం డేరా వేసుకొని జీవనం వెళ్లదీస్తుండడంతో వారి పక్కనే మరో డేరా వేసుకొని పని చేసుకుంటున్నారు. రెండు కుటుంబాలు ఒక్క దగ్గరే ఉంటుండడంతో వచ్చిన గిరాకీ కుటుంబ ఖర్చులకు సరిపోకపోవడంతో అక్కడికి వచ్చిన ఇతరుల ద్వారా లోహిత గ్రామానికి వెళ్లాలని నిశ్చయించుకున్నారు. ఈ క్రమంలోనే మామునూరు బెటా లియన్ నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌కు కూతవేటు దూరంలో 18 టైర్లతో కూడిన ట్రేలర్ ట్రక్ అతివేగంతో అదుపుతప్పి ఆటోను ఢీకొట్టడంతో అందులో ఉన్న భారీ ఇనుప రాడ్లు ఎగిరి కాస్త ముందు ఉన్నమరో ఆటోపై ఎగిరిపడ్డాయి. ఈ ఘటనలో నువురు సంతోశ్ చౌహాన్(45), అతడి కుమార్తెలు పూజ చౌహాన్(18), కిరణ్ చౌహాన్(18) అక్కడికక్కడే మ రణించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కుమా రుడు ఖన్నా (8) చనిపోయాడు. ఇనుపరాడ్లు పడడంతో మృతదేహాలు గుర్తుపట్టరాకుండా ఛిద్రమయ్యాయి.

మూడు జేసీబీలతో ఇనుపరాడ్ల తొలగింపు

ఘటనస్థలానికి చేరుకున్న పోలీసులకు అప్పటికే ట్రక్ రోడ్డుకు అడ్డంగా ఉండడంతో ట్రాఫిక్ జామైంది. దీనికితోడు ఇనుపరాడ్లు తీయడం సవాల్‌గా మారింది. సమీపంలోని మూడు జేసీబీలను తీసుకొచ్చారు. ఇటు ఆర్టీఓ జంక్షన్ వైపు హైవే రహదారిని మూసివేసి వాహనాలు రాకుండా చూశారు.

నలుగురిని బలిగొన్న మద్యం మత్తు..

మామునూరులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదానికి కారణమైన ట్రక్కు డ్రైవర్ రాజస్థాన్ వాసి యోగిందర్ సింగ్ తీవ్ర మద్యం మత్తులో ఉన్నాడు. అతడికి పోలీసులు బ్రీత్ అనలైజర్ టెస్టు చేయగా 280 ఎంజీ/100 మిలీ రీడింగ్ నమోదైంది. ఇతడి వల్ల నలుగురి ప్రాణాలు పోయాయి. చాలావరకు రోడ్డు ప్రమాదాలు అతివేగం, డ్రంకన్ డ్రైవ్ వల్లనే జరుగుతున్నాయని, తమకు ఏమాత్రం సంబంధంలేని వ్యక్తుల ప్రాణాలు తీస్తున్నారని వరంగల్ సీపీ అంబర్ కిశోర్ అన్నారు. ఇలాంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఆ జేసీబీల సాయంతో ఇనుప రాడ్లలో చిక్కుకున్న ఐదుగురు క్షతగాత్రులను బయటకు తీసేందుకు అరగంటకు పైగా సమయం తీసుకుంది. డీఆర్ఎఫ్ బృందాలు కూడా పనిచేశాయి. అప్పటికే సిద్ధంగా ఉన్న అంబులెన్స్‌ల్లో వారిని ఎంజీఎం ఆస్పత్రికి పంపించారు. ఆ తర్వాత రహదారికి అడ్డుగా ఉన్న ట్రేలర్ ట్రక్కును జేసీబీల సాయంతో ఎడమవైపునకు తోసేశారు. రహదారిపై పడి ఉన్న ఇనుప రాడ్లను కుడివైపున పడేశారు. ఆ తరువాత ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు గంటకుపైగా సమయం తీసుకుంది. ఘటనాస్థలిని కలెక్టర్ సత్యశారద, పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పరిశీలించారు.

నిన్న వెళ్తే.. ఈ ఘోరం జరిగి ఉండేది కాదు..

మామునూరు ప్రధాన రహదారికి ఆనుకొని వీరు వేసుకున్న డేరా బోసిపోయింది. ఉదయం 11 గంటల వరకు సంతోషంగా ఉన్న ఆ ఫ్యామిలీ 20 నిమిషాల వ్యవధిలో ఘోర ప్రమాదం బారినపడడంతో అక్కడున్న వారు అయ్యో పాపం అని చర్చించుకోవడం కనిపించింది. 'ఐదు రోజుల పాటు అక్కడే ఆడుతూ పాడుతూ గడిపిన సంతోశ్ కుటుంబం శనివారం సాయంత్రమే లోహితకు వెళ్లాల్సి ఉండే. బొల్లికుంట మీదుగా వెళ్తే త్వరగా వెళ్లొచ్చని చెప్పాం. తెలిసిన వారు గవిచర్ల క్రాస్ నుంచి రమ్మని చెబుతున్నారనడంతో ఆటోను రూ.1,000లకు కిరాయి అడిగితే ఏమీ లేనివారని రూ.500లకు మాట్లాడించి పంపించాం. నిమిషాల వ్యవధిలోనే ఆ కుటుంబం రోడ్డు ప్రమాదం బారినపడడంతో మాకు కన్నీళ్లు ఆగడం లేదు' అని అక్కడే టైలర్ దుకాణంలో పనిచేసే ఓ వ్యక్తి వాపోయాడు.

రూ.200 డీజిల్ పోయించుకున్నారు



ఆరుగురు ప్రయాణికులతో వెళుతున్న ఆటో మా పెట్రోల్ బంక్‌లో రూ.200 డీజిల్ పోయించుకున్నారు. ఫోన్ పే పనిచేయకపోవడంతో కాసేపు ఆగారు. చివరకు డబ్బులిచ్చి హైవేపైకి వెళ్లారు. నిమిషాల వ్యవధిలోనే ట్రేలర్ ట్రక్కు అతివేగంతో వచ్చి చేసిన ప్రమాదంతో వీరి ఆటో నుజ్జునుజ్జయింది. మేం పోయేసరికే ఆ ఇనుప రాడ్లు పడి అందులో చిక్కుకున్న వారి ఆర్తనాదాలు మాకు వినిపించాయి. ఆ ఇనుపరాడ్లు తీద్దామంటే బాగా బరువు ఉండడంతో తీయలేకపోయాం.

– జాకీర్, పెట్రోల్‌బంక్ సిబ్బంది

గంట ముందు మాట్లాడా..



గంట ముందు వరకు నన్ను ఎంతో ఆప్యాయంగా పలకరించారు. ఇక్కడికి కొద్ది మీటర్ల దూరంలో ఉన్న లోహిత గ్రామానికి వెళుతున్నామని, వచ్చే ఆదివారం కలుసుకుందామని చెప్పారు. ఇంతలోనే ఘోరం జరిగిపోయింది.


– సుమీర్, సంతోశ్ అన్న కుమారుడు

మెరుగైన వైద్యం అందించండి

- క్షతగాత్రులను పరామర్శించిన వరంగల్ కలెక్టర్ సత్యశారద



ఘటనాస్థలిలో కలెక్టర్ సత్యశారద



క్షతగాత్రులను పరిశీలిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

ఎంజీఎం: మామునూరు వద్ద ఆదివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాద ఘటనలో క్షతగాత్రులైన వారికి మెరుగైన వైద్యం అందించాలని వరంగల్ కలెక్టర్ సత్యశారద ఎంజీఎం వైద్యాధికారులను ఆదేశించారు. ప్రమాద ఘటనను పరిశీలించిన అనంతరం కలెక్టర్ డాక్టర్ సత్యశారద, మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఎంజీఎం ఆస్పత్రికి చేరుకున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. కాగా, స్వల్ప గాయాలపాలైన ఆటో డ్రైవర్ షకీల్‌ను వైద్య చికిత్స అనంతరం డిశ్చార్జ్ చేసినట్లు వైద్యులు తెలిపారు. మృతుల కుటుంబ సభ్యుల కోరిక మేరకు పోస్టుమార్టం పూర్తి చేసిన మృతదేహాలను, చికిత్స పొందుతున్న క్షతగాత్రులను కలెక్టర్ సత్యశారద ఆదేశాలతో ఎంజీఎం పరిపాలనాధికారులతోపాటు వరంగల్, ఖిలావరంగల్ తహసీల్దార్‌లు ఇక్బాల్, నాగేశ్వర్‌రావులు దగ్గరుండి ప్రత్యేక అంబులెన్స్‌లో వారి స్వగ్రామానికి పంపించారు.

మంత్రి సురేఖ పరామర్శ..

ఆస్పత్రిలోని క్షతగాత్రులను సాయంత్రం మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే నాగరాజు పరామర్శించారు. ఈ సందర్భంగా వారి ఆరోగ్య పరిస్థితుల గురించి ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ మురళీని అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం అన్నిరకాలుగా ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు.